సాక్షి
వికారాబాద్
శుక్రవారం ; 16 ; ఫిబ్రవరి ; 2024



ఉల్లి.. కల్పవల్లి

ఉల్లిసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండడంతో అధిక సంఖ్యలో సాగు చేస్తున్నారు. 8లో▸



జల్సాలకు అలవాటుపడి..

జల్సాలకు అలవాటుపడిన కేటుగాళ్లు ఆలయాలను లక్ష్యంగా చేసుకున్నారు. అందిన కాడికి దోచుకుంటున్నారు. 8లో▸



గిరిజనుల ఆరాధ్య దైవం..

బంజారాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆరుగురు ఎస్‌ఐల బదిలీ

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల్కచర్ల ఎస్‌ఐ శ్రీశైలంను బంట్వారం పీఎస్‌కు, వికారాబాద్ ఎస్‌ఐ అన్వేష్‌కుమార్‌ను కుల్కచర్లకు, బంటారం ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌ను దోమ పీఎస్‌కు, దోమ ఎస్‌ఐ రవిని వెయిటింగ్‌లో ఉంచారు. వెయిటింగ్‌లో ఉన్న ఎస్‌ఐలు కాశీనాథ్‌కు తాండూరు పీఎస్‌కు, సత్యనారాయణను వికారాబాద్ పీఎస్‌కు బదిలీ చేశారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 50,540 ఎకరాల్లో వరి నాట్లు వేశారని వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జీ అధికారి రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలో, మరికొన్ని చోట్ల పిలక దశలో ఉన్నాయని తెలిపారు. పిలక దశలో కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగుల ఉధృతి అధికంగా ఉందని తెలిపారు. నివారణకు వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు పాటించాలన్నారు. నారుమడిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేక 600 గ్రాముల పిప్రోనిల్ 0.3 గ్రాముల గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయసున్న పిలక దశలో ఉన్న వరి పైరులో కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు 10 కిలోలు లేక కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4గ్రాముల గుళికలు 8 కిలోలు లేక క్లోరంట్రానిలిప్రోల్ 0.4 గ్రాముల గుళికలు 4 కిలోలు 20–25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలన్నారు. అదే విధంగా పురుగు, కాండం తొలిచే పురుగు నివారణకు సిఫారసు చేయబడని ఇతర 10 గ్రాములు లేక సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్



శిక్షణ శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు

అనంతగిరి: జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం వికారాబాద్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పల్స్‌పోలియో – 2024పై జిల్లా వైద్యాధికారులు, సూపర్ వైజర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వ్యాప్తంగా ఎన్ని పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు, ఎంతమంది పిల్లలకు చుక్కల మందు వేస్తున్నారు అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి అక్కడి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డాక్టర్ బుచ్చిబాబు, జిల్లా వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏదండి.. బుల్లెట్ బండి

2021లో ప్రజాభిప్రాయ సేకరణ

- నేటికీ పట్టాలెక్కని ప్రాజెక్టు
- జిల్లాలో అవసరమైన భూమి 124.43 హెక్టార్లు
- ఈ ప్రాంత వాసులు కోల్పోనున్న ప్లాట్లు 532
- ఐదు మండలాలు, 39 గ్రామాలను కలుపుతూ రైలు మార్గం



వికారాబాద్: హైస్పీడ్ రైలు మార్గం కోసం ప్రతిపాదన చేసి రెండేళ్లు దాటినా ఉలుకుపలుకు లేదు. 2021 నవంబర్‌లో వికారాబాద్ మీదుగా హైదరాబాద్ – ముంబై బుల్లెట్ ట్రెన్ లైన్ నిర్మిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం సర్వే కూడా చేశారు. వికారాబాద్‌లో జిల్లా అధికారులతో కలిసి రైల్వే అధికారులు ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. మార్కెట్ విలువ చెల్లిస్తే తమ భూములు ఇచ్చేందుకు సిద్ధమని రైతులు పేర్కొన్నారు. జిల్లా మీదుగా వెళ్లనున్న హైస్పీడ్ రైల్వే కారిడార్ నిర్మాణం పూర్తయితే 14 గంటల సమయం పట్టే ముంబై ప్రయాణం కేవలం మూడు గంటల్లో చేరుకోవచ్చు. హైదరాబాద్‌కు 20 నిమిషాల్లో చేరుకునే వీలుంటుంది. అయితే ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ – వైజాగ్ బుల్లెట్ రైలు మార్గాన్ని ప్రతిపాదించిన ప్రభుత్వం వికారాబాద్ మీదుగా నిర్మిస్తామన్న బుల్లెట్ రైలు మార్గం ఊసెత్తకపోవడం ఈ ప్రాంత వాసులను నిరాశకు గురిచేసింది. నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వెళ్లే ఈ మార్గంలో బుల్లెట్ మార్గం గురించి ఇక్కడి ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం ప్రజల్లో అసంతృప్తికి గురిచేసింది.

మనదే వైజాగ్ తరలిపోయిందా?

హైదరాబాద్ – ముంబై బుల్లెట్ ట్రెన్‌నే హైదరాబాద్ – వైజాక్‌గా తరలించారా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో అధికారులు 2016 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తారని తెలిపారు. కొందరు రైతులు తాము ఇచ్చే భూములకు మార్కెట్ రేటుకు మించి చెల్లిస్తే ఇస్తామని తెలిపారు. మరికొందరు ఉన్న భూములు పోతే తామెలా బతకాలని, భూమికి భూమి ఇవ్వాలని కోరారు. ఉపాధి తోపాటు ఉద్యోగాలు ఇవ్వాలని మరికొందరు కోరారు. అయితే 17.5 మీటర్ల వెడెల్పుతో రైలు మార్గం నిర్మిస్తామని చెప్పిన అధికారులు, అదనంగా 500 మీటర్ల వెడెల్పుతో గ్రీన్ ప్రాజెక్టు పేరుతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ 500 మీటర్ల వెడెల్పుతో చేపట్టే గ్రీన్ ప్రాజెక్టు ఎలా కడతారు, దీని కోసం కూడా భూమి సేకరిస్తారా ? అభివృద్ధి అంటే ఎలాంటి ప్రాజెక్టులు చేపడతారు ? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు.

ప్రయోజనాలు

- హైదరాబాద్ – ముంబై రహదారి మీదుగా వెళితే 710 కిలోమీటర్లు, 13.15 గంటల సమయం పడుతుంది. ప్రస్తుతం ఉన్న రైల్ మార్గం ద్వారా వెళితే 773 కిలోమీటర్లు, 14 గంటల సమయం పడుతుంది.
- విమాన మార్గంలో హైదరాబాద్ – ముంబైకి 617 కిలోమీటర్లు ఉండగా, 1.30 గంటల సమయం పడుతుంది.
- వికారాబాద్ మీదుగా నిర్మించాలనుకుంటున్న హైస్పీడ్ రైలు మార్గం ప్రకారం 650 కిలోమీటర్లు వస్తుండగా 3 గంటల సమయం పట్టే అవకాశం ఉంది.
- ప్రస్తుతం రహదారులన్నీ వాహనాల రాకపోకల కారణంగా రద్దీగా మారిన నేపథ్యంలో హైస్పీడ్ రైలు మార్గం ఏర్పాటుకు ప్రాధాన్యత సంతరించుకుంది.
- ఈ కారిడార్ ఏర్పాటుతో ప్రయాణ సమయం బాగా తగ్గడంతో పాటు ఇప్పటికే ఉన్న రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గించే అవకాశం ఉంది. వాహనాల సముదాయాన్ని తగ్గించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గి గాలిలో నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది.
- ప్రధానంగా కనెక్టివిటీ పెరగటం ద్వారా తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలకు బూస్టింగ్ పెరిగి కొత్త ఉత్పత్తి స్థావరాలు, కారిడార్‌లలో టౌన్‌షిప్‌ల అభివృద్ధికి దోహదం చేయనుంది.
- ముంబై, పూణే, హైదరాబాద్, గుల్బర్గ, షోలాపూర్, వికారాబాద్ లాంటి నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గి కనెక్టివిటీ పెరుగుతుంది.

హైస్పీడ్ రైలు మార్గం గురించి క్లుప్తంగా..

- హైస్పీడ్ రైలు గంటకు 330 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనుంది. వికారాబాద్ మార్గంలో 300 కిలోమీటర్ల వేగంతో వెళ్లనుంది.
- ఈ రైల్వే కారిడార్ మొత్తం పొడవు(ముంబై నుంచి హైదరాబాద్ వరకు) 649 నుంచి 659 కిలోమీటర్లు ఉండే అవకాశం ఉంది. మొత్తం 8 జిల్లాల మీదుగా వెళుతుంది. వికారాబాద్ జిల్లాలో 68 కిలోమీటర్లు రైలు మార్గం ఉంటుంది.
- ముంబై నుంచి హైదరాబాద్ వరకు మొత్తం 10 రైల్వే స్టేషన్లు డిజైన్ చేయగా తెలంగాణలో వికారాబాద్, హైదరాబాద్ స్టేషన్లు ఉంటాయి. చివరి స్టేషన్ హైదరాబాద్ – సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయాలని భావించారు.
- జిల్లాలో ఐదు మండలాల పరిధిలోని 39 గ్రామాల మీదుగా ఈ రైల్ మార్గం ఉంటుంది.
- 750 మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఈ రైలును అభివృద్ధి చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

విజయమే లక్ష్యంగా బస్సు యాత్ర

- లోక్‌సభ ఎన్నికల్లో 10 నుంచి 12 స్థానాలు గెలుస్తాం
- బీఆర్‌ఎస్‌కు మూడు స్థానాలే దిక్కు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

తాండూరు టౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఈ నెల 20 నుంచి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తాండూరులో విలేకరులతో మాట్లాడారు. రాజరాజేశ్వర బస్సు యాత్ర పేరుతో తాండూరు నుంచి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ 23వ తేదీన శేరిలింగంపల్లిలో యాత్ర ముగించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తామన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనతో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 10 నుంచి 12 ఎంపీ స్థానాలను దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తు ఉండదని అన్నారు. బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని, ఆ పార్టీకి కేవలం మూడు ఎంపీ స్థానా లు మాత్రమే దక్కుతాయని జోస్యం చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో జనసేన పోటీ చేయకున్నా, వారి సంపూర్ణ మద్దతు బీజేపీకే ఉంటుందన్నారు. ముచ్చటగా మూడోసారి మోదీ నేతృత్వంలో ఎన్డీయే అధికారాన్ని చేజిక్కించుకుంటుదన్నారు. చేవెళ్ల స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో ఉంటారన్నారు. బుధవారం ఆయనపై కొందరు సంబంధం లేని విషయంలో దాడికి దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బాలి శివకుమార్, లలిత, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, కార్యదర్శి భద్రేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్ కుమార్, సాహు శ్రీలత, రజనీకాంత్, నరేష్ మహరాజ్, అమరేందర్, శాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన పూర్తి

వికారాబాద్ అర్బన్: మొదటి దశ ఈవీఎంల పరిశీలన ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఈవీఎంల గిడ్డంగి వద్ద నిర్వహించిన మాక్ పోలింగ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 12 మంది ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో సుమారు 80 మంది సిబ్బందితో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రాణం తీసిన కుటుంబ గొడవలు

- కత్తితో దాడి చేసి తండ్రిని చంపిన తనయుడు
- మోమిన్‌పేటలో ఘటన

మోమిన్‌పేట: తల్లితో తరచూ గొడవ పడుతున్న తండ్రిని తనయుడు కత్తితో దాడి చేసి కడతేర్చాడు. ఈ సంఘటన మోమిన్‌పేటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయన్‌పల్లికి చెందిన పూండికూర నర్సింలు (50)కు భార్య జయమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. ఇది భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన పెద్ద కొడుకు మల్లేశ్ రెండేళ్ల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో చిన్న కుమారుడు అనంతరాములును తీసుకుని జయమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆరు నెలల క్రితం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా.. తిరిగి స్వగ్రామానికి వచ్చారు. అయినప్పటికీ నర్సింలులో ఎలాంటి మార్పు రాలేదు. భార్యాభర్తలు ఎప్పటిలాగే నిత్యం గొడవ పడుతున్నారు. దీంతో నెల రోజులు గడవక ముందే జయమ్మ కొడుకును తీసుకుని మళ్లీ పుట్టింటికి వెళ్లిపోయింది. సంసారం గాడి తప్పుతోందని భావించిన జయమ్మ రెండు నెలల క్రితం సొంత నిర్ణయంతో చంద్రాయన్‌పల్లికి వచ్చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భార్యాభర్తలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో అనంతరాములు తండ్రిని వారించాడు. మాటామాటా పెరగడంతో తండ్రిపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో నర్సింలు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ అరవింద్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిజిటలైజేషన్‌కు సమాయత్తం

- త్వరలో ప్రతి ఇంటికీ డిజిటల్ డోర్ నంబర్
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సమాచారం సేకరణ
- అక్రమాలకు, ఆస్తి పన్ను ఎగవేతకు చెక్
- పెరగనున్న మున్సిపాలిటీల ఆదాయం



వికారాబాద్ పట్టణం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ డిజిటల్ డోర్ నంబర్ రానుంది. ఫలితంగా ఇంటి అడ్రస్ ఈజీగా తెలిసిపోనుంది. ప్రస్తుతం ఒక వీధిలో ఉంటూ పక్క వీధి ఇంటి నంబర్లు ఇవ్వడం తోపాటు, బై నంబర్లతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ ఇంటి నంబరైనా దొరకాలంటే చుట్టూ పది ఇళ్లను తిరిగి కనుక్కోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోనుంది. ఇంటికి డిజిటల్ నంబర్ ఇవ్వడం ద్వారా అడ్రస్ ఈజీగా దొరికే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రతి వార్డులో ఎన్ని రోడ్లున్నాయి..? మురికి కాలువలు ఎన్ని ?, వీధి దీపాలు ఎన్ని ఉన్నాయి..? అక్కడ మౌలిక సదుపాయాలు ఏమున్నాయి..? వంటి డేటా సైతం అందుబాటులో ఉండనుంది.

జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా నమోదు

మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం, వ్యాపార సముదాయాల నిర్మాణం వంటి వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)ను ఉపయోగిస్తోంది. ఈ మేరకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అధికారులు సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఇటీవలే అన్ని మున్సిపాలిటీల్లో జీఐఎస్ సిస్టమ్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత శాఖ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు తమ సిబ్బందితో సర్వే ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాల్టీలు ఉండగా ముందుగా వికారాబాద్‌లో ఈ డాటా సేకరణకు చర్యలు తీసుకుంటున్నారు. సదరు ఏజెన్సీ మున్సిపాలిటీలోని భవన నిర్మాణాల సంఖ్య, పక్కా అనుమతులతో నిర్మించారా..? లేదా, నాలాలు మూసివేసి నిర్మించారా..? రోడ్లను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారా..? వార్డు పరిధిలో ఎన్ని నల్లాలు ఉన్నాయి..? తాగునీటి సౌకర్యం వంటి వివరాల తోపాటు, మున్సిపల్ పరిధిలో ఎన్ని అపార్ట్‌మెంట్లు ఉన్నాయి..? ఎన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వ్యాపార సముదాయాలతో పాటు సమగ్ర సమాచారం మొత్తం జీఐఎస్ సాంకేతికతతో గుర్తించేందుకు సిద్ధమవుతున్నారు. ఇది పూర్తయితే ప్రతి ఇంటకి సంబంధించిన సమగ్ర సమాచారం మున్సిపల్ అధికారుల వద్ద ఉంటుంది. డాటా సేకరణ సమయంలో ఇంటికి సంబంధించిన మ్యాప్‌లో ప్రతి అంశాన్ని పొందుపరచనున్నారు.

మున్సిపల్	నివాసాలు
వికారాబాద్	14,552
కొడంగల్	4,098
తాండూరు	13,952
పరిగి	5,055

అక్రమ నిర్మాణాలకు చెక్

మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఒకరకంగా పొంది, మరో రకంగా నిర్మాణాలు చేస్తుంటారు. ఇలా అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేసుకుంటే జీఐఎస్ సాంకేతికతతో ఇట్టే తెలిసిపోతుంది. ఒక అంతస్తుకు మాత్రమే అనుమతి పొంది రెండు మూడు అంతస్తులు కూడా నిర్మిస్తుంటారు. ఇలాంటి వివరాలన్నీ ఈ సాంకేతికతతో తెలియనున్నాయి. దీంతో అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉంది. గతంలో మున్సిపాల్టీలో భువన్ సర్వే నిర్వహించి సమాచారాన్ని సేకరించారు. ఇప్పుడు అదే తరహాలో ఈసారి పూర్తిస్థాయిలో జీఐఎస్ ద్వారా సమాచారం చేపడుతున్నారు. ప్రతి నిర్మాణం ఎంతమేర విస్తీర్ణంలో ఉంది..? ఎంత పరిధి ఉంది..? ఎన్ని చదరపు మీటర్లలో నిర్మించారు వంటి పూర్తి వివరాలు ఉంటాయి. మున్సిపాల్టీల వారీగా ఏ సమాచారం కావాలన్నా ఆన్‌లైన్‌లో క్లిక్ చేయగానే భవన నిర్మాణాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. కొందరు మున్సిపాల్టీల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఆస్తిపన్ను సైతం చెల్లించని వారు ఉంటారు. తాజాగా చేపట్టనున్న జీఐఎస్ సాంకేతికతతో మున్సిపల్‌లో ప్రతి నిర్మాణాన్ని ఇంటర్నెట్‌లో పొందుపరిచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఈ సమాచారం అందుబాటులో ఉండనుంది. ఉన్నతాధికారులు ఎప్పుడైనా సమాచారం అడిగితే అప్పటికప్పుడు నివేదికలు తయారుచేసి ఇవ్వడానికి వీలుంటుంది. కొత్తగా నిర్మించే మురుగు కాలువలు గానీ, రోడ్ల పరిధి గానీ, పారిశ్రామికంగా గానీ ఎలా ఉండాలన్నది ఈ గూగుల్ మ్యాప్ ఆధారంగానే అధికారులు అక్కడి నుంచే పలు సూచనలు, సలహాలు ఇవ్వడానికి అవకాశం ఉంది. జీఐఎస్ సిస్టమ్ ద్వారా చేపడుతున్న ఈ సర్వేతో మున్సిపాల్టీల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన డాటాను పూర్తిగా సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ డేటా సేకరించడానికి హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ టెక్నాలజీకి అప్పగించారు.

సమగ్ర సమాచారం ఉంటుంది



వికారాబాద్ మున్సిపాల్టీలో త్వరలో జీఐఎస్ సాంకేతికతతో మ్యాపింగ్ నిర్వహిస్తాం. ఈ మ్యాపింగ్ ఆధారంగా ప్రతి ఇంటికీ డిజిటల్ నంబర్ కేటాయింపు తోపాటు పూర్తి సమాచారం మున్సిపల్ తోపాటు, గూగుల్‌లో ఉంటుంది. దీంతో అక్రమాలకు చెక్ పెడటమే కాకుండా మున్సిపల్ ఆదాయం పెరుగుతుంది. ఈ వివరాల నమోదుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశం కూడా ఉంది.

– జాకీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, వికారాబాద్

దేశ ప్రతిష్టను పెంచిన మోదీ

- బీజేపీ నేత ఈటల రాజేందర్
- పార్టీలో చేరిన చేవెళ్ల ఎంపీపీ దంపతులు

చేవెళ్ల: దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలకు కాలం చెల్లిందని, నరేంద్రమోదీ ప్రధాని అయిన తరువాత దేశ గౌరవం, ప్రతిష్ఠ పెరిగిందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో స్థానిక ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ఆమె భర్త రమణారెడ్డి అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ వీడి బీజేపీలో చేరారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో వారికి ఈటల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంపూర్ణ మద్దతు మోదీకే ఉందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించి 140కోట్ల మంది ప్రజల మనస్సు గెలిచారని పేర్కొన్నారు. మోదీ పాలనలో భారతదేశం పక్క దేశాలకు సహాయం చేసే స్థాయికి ఎదిగిందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దేశవ్యాప్తంగా 400ల సీట్లు వస్తాయని, మళ్లీ కేంద్రంలో మాదే అధికారమని అన్నారు. తెలంగాణలోని 17సీట్లు గెలిపించుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతో మంచి వ్యక్తి అని, ఆపదలో ప్రజలను ఆదుకుంటారని అన్నారు. అలాంటి వ్యక్తిని భారీ మెజార్టీతో పార్లమెంట్‌కు పంపాలని కోరారు.



ఎంపీపీ విజయలక్ష్మి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేఎస్ రత్నం

అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నరేశ్, దేవుని శర్వలింగం, కృష్ణాగౌడ్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, సురేశ్, నరేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన నచ్చి బీజేపీలోకి..

ప్రధాని మోదీ సుపరి పాలన, అభివృద్ధి చూసి బీజేపీలో చేరినట్లు చేవెళ్ల ఎంపీపీ ఎం విజయలక్ష్మి, ఆమె భర్త రమణారెడ్డి తెలిపారు. వారితోపాటు మాజీ ఎంపీపీ ఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివానందం, వైభవ్‌రెడ్డి, దేవుని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, ఉప సర్పంచులు రాజిరెడ్డి, రాధిక, బీఆర్‌ఎస్ కౌకుంట్ల రైతు సంఘం అధ్యక్షుడు నాగార్జున్‌రెడ్డి, బస్తేపూర్ మాజీ సర్పంచ్ జంగయ్య, చేవెళ్ల మాజీ సర్పంచ్ వెంకటమ్మ, అల్లవాడ మాజీ సర్పంచ్ అనురాధ, బీఆర్‌ఎస్ దేవుని ఎర్రవల్లి బీసీ సెల్ అధ్యక్షుడు రాములు, నాయకులు శశిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్, యాదయ్య, మోజహన్‌రెడ్డి, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బీజేపీలో చేరారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ రైస్‌ను వెంటనే డెలివరీ చేయండి

అదనపు కలెక్టర్‌ లింగ్యా నాయక్‌

వికారాబాద్‌ అర్బన్‌: కస్టం మిల్లింగ్‌ రైస్‌ (సీఎంఆర్‌)ను వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ లింగ్యా నాయక్‌ రైస్‌ మిల్లర్లను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టర్‌ కార్యాలయంలోని తన చాంబర్‌లో పౌరసరఫరాల అధికారులు రైస్‌ మిల్లర్లతో సీఎంఆర్‌ రైస్‌ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్‌ మాట్లాడుతూ.. 2022–23 సంవత్సరానికి సంబంధించిన ఫిబ్రవరి మాసంతం వరకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైస్‌ మిల్లర్లు తమ వద్ద నిలువగా ఉన్న సీఎంఆర్‌ రైస్‌ను వంద శాతం ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మేనేజర్‌ కొండలరావు పాల్గొన్నారు.

ఇంట్లో ఉన్న మహిళపై వీధి కుక్క దాడి

దోమ: వీధి కుక్క దాడిలో మహిళకు గాయాలైన సంఘటన దోమ మండలంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలేపల్లి గ్రామానికి చెందిన రిజ్వానా(38) జ్వరంతో బాధపడుతూ ఇంట్లో నిద్రిస్తుంది. అదే సమయంలో ఓ వీధి కుక్క ఇంట్లోకి దూరి ఆమెపై దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఆమెకు మూడు కాట్లు పడగా వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. అయితే గ్రామాలలో వీధి కుక్కలు రోజు రోజుకు పెరిగిపోవడంతో చిన్నారులు, మహిళలు ఎక్కువగా దాడులకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాటి నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

యువతి అదృశ్యం



అనురాధ (ఫైల్‌)

మొయినాబాద్‌: పనిచేసే చోట జీతం తీసుకోవడానికంటూ వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. మొయినాబాద్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ మండలం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన బాయికాడ భగవంత్‌ కుటుంబం కొంత కాలం క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చింది. భగవంత్‌ కూతురు అనురాధ(20) నగరంలో హౌస్‌ కీపింగ్‌ పనిచేస్తుంది. పనిచేసే చోట సాలరీ తీసుకుని వస్తానని జనవరి 29న ఇంటి నుంచి వెళ్లింది. ఆ రోజు రాత్రి అక్కడే ఉండి జనవరి 30న బయలుదేరి వెళ్లింది. కానీ ఇంటికి మాత్రం రాలేదు. కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ వచ్చింది. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా

ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన వాజీద్‌

నందిగామ: కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. షాద్‌నగర్‌ పట్టణానికి చెందిన వాజీద్‌ షాద్‌నగర్‌ నుంచి కొత్తూరు వైపు కారులో ప్రయాణిస్తున్నాడు. ఆయన కారును అతివేగంగా డ్రైవ్‌ చేయడంతో చంద్రాయాన్‌గూడ సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వాజీద్‌ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌ తెలిపారు.

యువకుడి బలవన్మరణం



శేషు (ఫైల్‌)

యాచారం: ఇంట్లోనే ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గునుగల్‌ గ్రామానికి చెందిన గొట్టం జంగయ్య, అండాలు దంపతుల కుమారుడైన శేషు(25) బుధవారం సమీప బంధువుల శుభకార్యంలో పాల్గొన్నాడు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తెల్లవారే సరికే శేషు విగతజీవిగా కనిపించాడు. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్‌ తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ప్రసాద్‌కుమార్‌

అనంతగిరి: వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన రేణుకాదేవి కొంత కాలంగా అనారోగ్యంతో నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సదరు మహిళ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ చొరవ తీసుకొని రూ.2.40లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. గురువారం ఇందుకు సంబంధించిన పత్రాన్ని నగరంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉల్లి.. కల్పవల్లి

- భూగర్భ జలాలు పెరగడంతో సాగుకు రైతుల ఆసక్తి
- యాసంగిలో 950 ఎకరాల్లో సాగవుతున్న పంట



మర్పల్లి: ఆరుతడి పంటలైన ఉల్లిసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో కొంతకాలంగా ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉండడంతో బావులు, బోర్లు కలిగిన రైతులు సైతం ఉల్లిపంట సాగుపై దృష్టి సారించారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరుగడంతో చెరువుల్లో నీటి మట్టాలు ఘణనీయంగా పెరిగాయి. దీంతో చెరువుల కింద కాలువల ద్వారా వచ్చే నీటితో పాటు బోర్లు, బావులు కలిగిన రైతులు ఇతర పంటలతో పాటు ఉల్లిపంట సాగుచేస్తున్నారు. మండల పరిధిలోని పంచలింగాల, కొత్లాపూర్, వీర్లపల్లి, సిరిపురం, మర్పల్లి, పట్లూర్, కొంషేట్‌పల్లి, దార్గులపల్లి, తుమ్మలపల్లి, నర్సాపూర్, ఘణాపూర్, మొగిలిగుండ్ల వంటి గ్రామాల్లో సుమారు 950 ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

ఆదర్శం.. పంచలింగాల

మండల పరిధిలోని పంచలింగాల గ్రామం ఉల్లి సాగుకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది కురిసిన వర్షాలకు పంచలింగాల చెరువులో గతంలో ఎప్పుడు లేని విధంగా నీటి మట్టాలు పెరగడంతో కాలువల కింద భూములు కలిగిన రైతులు, బోర్లు, బావులు కలిగిన ప్రతీ రైతు ఉల్లి సాగు చేపట్టారు. మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలు, ఎనిమిది అనుబంధ గ్రామాల్లో యాసంగి పంటగా సుమారు 950 ఎకరాల్లో ఉల్లి సాగవుతుంగా ఒక పంచలింగాల గ్రామంలో మాత్రం సుమారు 430 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఉల్లి విత్తనాలు సబ్సిడీపై అందజేసేదని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉల్లి విత్తనాల సరఫరా నిలిచిపోయింది. దీంతో తమ పొలాల్లో తయారు చేసుకున్న విత్తనాలనే నారు మడులుగా పోసి విత్తనం తయారు చేసుకుని ఉల్లి సాగు చేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా సాగుకు సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు వస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. పంట ఆశాజనకంగా ఉంటే ఎకరా పంటకు 70 నుంచి 80 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందంటున్నారు. క్వింటాల్‌కు రూ.2వేల ధర పలికితే లాభం వచ్చినట్లేనని రైతులు వెల్లడిస్తున్నారు. ఆరుతడి పంటల సాగుకు కూలీల కొరత వేధిస్తుందని.. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి సాగుకు ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురువడంతో భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయాధికారులు ఏ పంటలు వేసుకోవాలో చెప్పడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, బిందు సేద్యం పరికరాలు సరఫరా చేసేవారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేసింది. ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికి విత్తనాలు, బిందు సేద్యం పరికారలు సబ్సిడీపై ఇవ్వాలి.

– నాగేశ్, రైతు. తుమ్మలపల్లి

ప్రతీ సంవత్సరం సాగు చేస్తున్నా

ప్రతీ సంవత్సరం తమకున్న రెండు ఎకారాల్లో ఉల్లి సాగు చేస్తున్నా. ఈ ఏడాది బోరు కింద ఎకరా ఉల్లి పంట వేశా. మరో ఎకరంలో పత్తి పంట ఉంది. పత్తి తీసిన వెంటనే ఉల్లి సాగు చేస్తాం. ఉల్లి నిల్వల కోసం శీతల గిడ్డంగులు, లేదా షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరించాలి. ఉద్యాన శాఖ అధికారులు సైతం రైతులకు అవగాహన కల్పించాలి.

– ఆనందయ్య, రైతు, పంచలింగాల

గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్‌ కృషి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఉరేంటితండాలో సేవాలాల్‌ మహరాజ్‌ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్‌: గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పెద్దేముల్‌ మండల ఉరేంటితండాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సేవాలాల్‌ విగ్రహాన్ని ఆవిష్కరించి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన శ్రీ సంత్‌ సేవాలాల్‌ ఆదర్శ మూర్తి అని కొనియాడారు. గిరిజనులు ఐక్యంగా ఉండి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, ఎంపీటీసీ సభ్యుడు ధన్‌సింగ్, మాజీ సర్పంచ్‌ టోప్యానాయక్, తాండూరు వ్యవసాయ మార్కెట్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ జితేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, నియోజకవర్గ కాంగ్రెస్‌– ఎబ్లాక్‌ అధ్యక్షుడు నర్సింలు, మాజీ కౌన్సిలర్‌ వెంకటరామ్‌ నాయక్, యువ నాయకుడు మైపాల్‌రెడ్డి, గిరిజన నాయకులు రాము నాయక్, బాబుసింగ్, నర్సింగ్‌ నాయక్, ఠాకునాయక్, రతన్, జయరాం, తుకారాం, గోపాల్, సుభాష్, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరులో ధ్వజస్తంభం..

మండల పరిధిలోని ఇందూరు గ్రామంలో గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆంజనేయ స్వామి, వీర భద్రేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలకు హాజరయ్యారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలి మృతి



బాలమ్మ (ఫైల్‌)

మైలార్‌దేవ్‌పల్లి: టిఫిన్‌ సెంటర్‌ వద్ద అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని నవాబ్‌పేట్‌కు చెందిన బాలమ్మ (65) కొన్ని రోజుల క్రితం కాటేదాన్‌లో తన చిన్న కూతురి దగ్గరకు వచ్చింది. బుధవారం సాయంత్రం రేషన్‌ షాపునకు వెళ్లి వస్తానని కూతురికి చెప్పి వెళ్లింది. రాత్రి అయిన వెళ్లలేదు. బాలమ్మకు కల్లు తాగే అలవాటు ఉందని, కొంత కల్లు తాగినట్లు స్థానికుల పేర్కొన్నారు. ఉదయం కాటేదాన్‌లోని ఓ టిఫిన్‌ సెంటర్‌ ఎదుట మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

‘పీఎం విశ్వకర్మను’ వినియోగించుకోండి

జిల్లా పరిశ్రమల శాఖ జనరల్‌ మేనేజర్‌ విజయ్‌కుమార్‌



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ అధికారి

వికారాబాద్‌ అర్బన్‌: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్‌ మేనేజర్‌ విజయ్‌కుమార్‌ సూచించారు. గురువారం కలక్టరేట్‌ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ చేతి వృత్తుల వారిని, హస్తకళాకారులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీఎం విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన విశ్వకర్మలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీ సేవ కేంద్రాలు, గ్రామ పం చాయతీ కార్యాలయాల నుంచి ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఎంపికైన వారికి ఏడు నుంచి 15 రోజుల పాటు మెరుగైన నైపుణ్యత కోసం శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్‌ చెల్లిస్తారని తెలిపారు. లబ్ధిదారులకు రూ.3లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విశ్వకర్మలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ సుధీర్‌ కుమార్, ఎస్‌బీఐ రీజినల్‌ ఆఫీస్‌ ఛీఫ్‌ మేనేజర్‌ వికాస్‌ సాహూ, ఎల్‌డీఎం రాంబాబు, మెప్మా పీడీ రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

షాబాద్‌: అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుందన్‌ టెక్స్‌టైల్స్‌ పరిశ్రమలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. షాబాద్‌ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న కుందన్‌ టెక్స్‌టైల్స్‌ పరిశ్రమలో రంజిత్‌కుష్వల్, సీత అన్నాచెల్లెలు పని చేస్తున్నారు. బుధవారం ఉదయం సోదరుడు కూలీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా సీత(20) విగత జీవిగా మారింది. ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అనారోగ్య సమస్యతో రెండు రోజుల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లో ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి తల్లి, అక్క, అన్న, తమ్ముడు ఉన్నారు. గురువారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా నాగులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

మొయినాబాద్‌ రూరల్‌: నాగులమ్మ విగ్రహాల ప్రతిష్టాపనను వేదపండితులు, పూజారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో ఎలిగెని సత్యనారాయణ దంపతులు పాల్గొని గణపతి హోమం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

ఆలయం లూటీ చేసిన కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సింహారావు

కొత్తూరు: జల్సాలకు రుచి మరిగిన కేటుగాళ్లు ఆలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. అందికాడికి దోచుకొని ఉడాయించారు. ఆ నిందితులను కొత్తూరు పోలీసులు చాకచక్యంగా గురువారం అరెస్టు చేశారు. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు పట్టణంలోని భవానీనగర్‌ కాలనీలో ఉన్న మందోనిబాయి మైసమ్మ ఆలయంలో ఈ నెల 12న నిందితులు చోరీకి పాల్పడి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు, హుండీలో ఉన్న నగదు, పూజకు ఉపయోగించే రాగి, ఇత్తడి వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటనపై ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక పోలీసులు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎంఆర్‌ఎఫ్‌ షోరూం పక్కన వెంచర్లో పెట్రోలింగ్‌ చేస్తుండగా పట్టణంలో నివసిస్తున్న రాహుల్‌సింగ్‌(21), శనిదేవ్‌(20), నందిగామ మండలం రంగాపూర్‌కు చెందిన మహేందర్‌(22)లు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మైసమ్మ ఆలయంలో చోరీ చేసిన విషయాన్ని తెలిపారు. అనంతరం వారి నుంచి అమ్మవారి అలంకారానికి ఉపయోగించే బంగారు, వెండి ఆభరణాలు, పూజకు వినియోగించే ఇత్తడి, రాగి వస్తువులతో పాటు రూ.22,250, కారును రికవరీ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనకు కృషి చేసిన ఎస్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ అబ్దుల్లాతో పాటు ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.

కబ్జాదారుల కోరలు పీకేస్తాం

- జీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లల్లో చెరువుల పరిశీలన
- త్వరలో మంత్రి ఉత్తమ్‌తో చెరువుల సుందరీకరణ, అక్రమాలపై రివ్యూ
- కాంగ్రెస్‌ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్ల పరిధిలో మాయమైన చెరువులను మళ్లీ రీస్టోర్‌ చేసేలా, కబ్జాదారులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్‌ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. త్వరలో ఇరిగేషన్‌ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి చెరువులను పరిశీలిస్తారని తెలిపారు. గతంలో ఉన్న తటాకాల విస్తీర్ణం ఎంత? ఇప్పుడు ఉన్నది ఎంత? భూకబ్జాదారులు ఎవరు? అధికారుల పాత్ర ఏమిటని.. ఉన్నతాధికారులతో రివ్యూ చేస్తామని కేఎల్‌ఆర్‌ చెప్పారు. చెరువుల పరిరక్షణ సమితి సహా పర్యావరణ పరిరక్షణ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, అఖిల పక్షం నాయకులు పాల్గొని ఈ చెరువుల పునరుద్ధరణ కార్యక్రమానికి సహకరించాలని కేఎల్‌ఆర్‌ కోరారు.

కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు

ఇన్‌చార్జి శ్రీనివాస్‌

పెద్దేముల్‌: సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా మండల పరిధిలోని మారేపల్లి సుమిత్ర కాటన్‌ మిల్లు, జనగాం కాటన్‌ మిల్లు నుంచి ఇప్పటి వరకు 90,157 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌ తెలిపారు. పెద్దేముల్, ధారూరు, కోటపల్లి, బషీరాబాద్, యాలాల, బంట్వారం, మర్పల్లితో పాటు పలు మండలాల నుంచి రైతులు పత్తి విక్రయానికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పత్తి విక్రయానికి వచ్చిన రైతులకు అన్ని వసతులు కల్పించామన్నారు. తాగునీటితో పాటు వసతులు కల్పించటం జరుగుతుందన్నారు.ప్రారంభంలో కాస్త రైతులకు ఇబ్బందులు కలిగిన ప్రస్తుతం ఏలాంటి సమస్యలు రావటం లేదని తెలియచేశారు. రైతులు విక్రయించిన పది నుండి 12రోజుల లోపే వారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తందని జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

వ్యక్తి మృతి



జహంగీర్(ఫైల్)

కొందుర్గు: లారీ ఢీకొట్టడంతో ఓ కూరగాయలు అమ్మే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడకు చెందిన జహంగీర్(61) బుధవారం తన పొలంలో పండించిన కూరగాయాలను విక్రయించేందుకు రామచంద్రాపూర్‌ సంతకు వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తన టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై వస్తున్నాడు. మండల కేంద్రం సమీపంలోని స్కాన్‌ ఐరన్‌ పరిశ్రమ వద్దకు రాగానే షాద్‌నగర్‌ నుంచి కొందుర్గు ప్రయాణిస్తున్న లారీ వెనుక నుంచి టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో జహంగీర్‌ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొందుర్గు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సలహామేరకు నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు అజ్మీర్‌ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

లైంగికదాడి, హత్యకేసులో యావజ్జీవ శిక్ష

రాజేంద్రనగర్‌: బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి రాజేంద్రనగర్‌ ఫోక్సో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెపల్లికి చెందిన మహ్మద్‌ ఇర్ఫాన్‌ (35) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. 2016లో స్థానికంగా ఆడుకుంటున్న మైనర్‌ (8)ని తన బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి హత్య చేసి కాలువలో పడేసి వెళ్లిపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లి దండ్రులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా కాలువ వద్ద మృతదేహం లభించింది. దీంతో పోలీసులు క్లూస్‌ టీంను రప్పించి పూర్తి ఆధారాలు సేకరించి మహ్మద్‌ ఇర్ఫాన్‌ను నిందితుడిగా తేల్చారు. ఇర్ఫాన్‌కు అతని సోదరుడు సహకరించినట్లు విచారణలో తేలింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇర్ఫాన్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ జడ్జి తుది తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి సహకరించిన సోదరుడు రిమాండ్‌కు వెళ్లిన అనంతరం బెయిల్‌పై బయటకి వచ్చి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గోవా క్యాంప్‌నకు మణికొండ కౌన్సిలర్లు

మణికొండ: అవిశ్వాసం తేదీ సమీపిస్తుండడంతో మణికొండ మున్సిపల్‌ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. చైర్మన్‌ కె.నరేందర్‌ముదిరాజ్‌పై పది మంది కౌన్సిలర్లు గత నెల కలెక్టర్‌కు అవిశ్వాసం లేఖ ఇచ్చినప్పటి నుంచి స్థానికంగా మెజార్టీ కౌన్సిలర్లు గురువారం గోవా బాట పట్టారు. అవిశ్వాసం నెగ్గాలంటే 13 మంది సభ్యుల బలం కావాలి. అయితే పది మంది కౌన్సిలర్లు సంతకాలతో కలెక్టర్‌కు లేఖ అందించడం, 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్‌ కె.లమి అనూహ్యంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రేసులోకి రావడంతో వారి బలం 11కు పెరిగింది. ఇక వైస్‌ చైర్మన్‌ నరేందర్‌రెడ్డి తటస్థంగా ఉన్నారు. అతను వారికి మద్దతు పలికినా వారి సంఖ్య 12కు చేరుకోనున్నది. వీరికి మరో సభ్యుడు మద్దతు తెలిపితే తప్ప అవిశ్వాసం నెగ్గే సూచనలు కనిపించడం లేదు. అయితే అవిశ్వాసం పెట్టిన కొందరు కౌన్సిలర్లతో ఈ మధ్య చైర్మన్‌ నరేందర్‌ముదిరాజ్‌ ఫోన్లు చేసి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ విషయం తెలుసుకున్న పది మంది వరకు కౌన్సిలర్లు క్యాంప్‌నకు వెళ్లి ఈనెల 22వ తేదీనే నేరుగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలనే నిర్ణయానికి వచ్చి గోవాకు వెళ్లినట్లు సమాచారం. వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్‌ బి.కావ్య స్థానికంగానే ఉన్నట్లు తెలిసింది.

2.13 నిమిషాలు.. 150 గ్రాముల బంగారం!

అక్బర్‌బాగ్‌ దోపిడీ 3 నిమిషాల్లోపే పూర్తి

- కస్టమర్‌గా వచ్చిన వ్యక్తి సైతం నిందితుడిగా నిర్ధారణ
- నిందితుల గుర్తింపు, పోలీసుల అదుపులో ఇరువురు



1,3: దోపిడీ దొంగలు, 2: బాధితుడు, 4: వినియోగదారుడిగా వచ్చిన నిందితుడు

సాక్షి, సిటీబ్యూరో: సౌత్‌ ఈస్ట్‌ జోన్‌లో ఉన్న చాదర్‌ఘాట్‌ ప్రాంతంలోని కిస్వా జ్యువెలరీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం దోపిడీకి ఒడిగట్టిన నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరు, కస్టమర్‌గా నటించిన మూడో వ్యక్తి పాతబస్తీకి చెందిన వ్యక్తిగా తేల్చారు. గురువారం రాత్రి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు పరారీలో ఉన్న మూడో వ్యక్తిని పట్టుకోవడంతో పాటు దోపిడీకి గురైన సొత్తు రికవరీ చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దుకాణంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా కేవలం 2.13 నిమిషాల్లోనే దోపిడీ దొంగలు 150 గ్రాముల బంగారం దోచుకుపోయినట్లు తేల్చారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా బుధవారం మధ్యా హ్నం ఏ క్షణాన ఏమి జరిగిందంటే..

1.25 గంటల 26 సెకండ్లు:

తలకు టోపీ, ముఖానికి మాస్క్‌ ధరించి వచ్చిన ఓ యువకుడు దుకాణంలోకి వచ్చాడు. వినియోగదారుడిగా నటిస్తూ క్యాష్‌ కౌంటర్‌లో కూర్చుకున్న యజమాని కుమారుడు సజావుర్‌ రెహ్మాన్‌ను వెండి గొలుసులు చూపించాలని అడిగాడు.

1.26 గంటల 08 సెకన్లు:

డబీర్‌పుర ఫ్లైఓవర్‌ వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఈ దుకాణం ఎదురుగా ఆగారు. వీళ్ల కూడా ‘వినియోగదారుడి’ మాదిరిగానే మాస్కులతో పాటు ఒకరు టోపీ, మరొకరు హెల్మెట్‌తో ఉన్నారు.

1.26 గంటల 12 సెకన్లు:

‘వినియోగదారుడు’ కోరిన వెండి గొలుసులతో కూడిన బాక్సును తీసుకువచ్చిన సజావుర్‌ రెహ్మాన్‌ కౌంటర్‌పై పెట్టి చూపిస్తున్నారు. దుకాణంలో ఇంకా ఎవరైనా ఉంటే మిగిలిన ఇద్దరినీ అప్రమత్తం చేసి, దోపిడీ వాయిదా వేయించడమే ఈ దుండగుడి ఆలోచనగా పోలీసులు తేల్చారు.

1.26 గంటల 16 సెకన్లు:

ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిలో బైక్‌ వెనుక కూర్చున్న దుండగుడు చేతిలో సంచితో దుకాణంలోకి ప్రవేశించాడు. క్యాష్‌ కౌంటర్‌ ఎదురుగా ఉన్న కుర్చీ ఎక్కి కౌంటర్‌ మీదకు చేరాడు. ఇతడిని సజావుర్‌ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వెనక్కు దిగాడు.

1.26 గంటల 23 సెకన్లు:

తన నడుం వద్ద దాచి ఉంచిన కత్తిని బయటకు తీసి, క్యాష్‌ కౌంటర్‌ దాటిన ఈ దుండగుడు సజావుర్‌ రెహ్మాన్‌పై దాడికి దిగాడు. ఈ దారుణం జరుగున్నంతసేపూ అక్కడే ఓ పక్కగా ఉండిపోయిన ‘వినియోగదారుడు’ అడ్డుకోవడానికి లేదా స్థానికులకు అప్రమత్తం చేయడానికీ ప్రయత్నించకపోవడం గమనార్హం.

1.26 గంటల 36 సెకన్లు:

అప్పటి వరకు వాహనం వద్దే ఉండిపోయిన రెండో వ్యక్తి హెల్మెట్‌తో సహా దుకాణంలోకి ప్రవేశించాడు. మొదటి వాడు సజావుర్‌ రెహ్మాన్‌ను షోకేస్‌కు, కౌంటర్‌కు మధ్య పడేసి ఒడిసిపట్టుకోగా... రెండో వాడు ఆభరణాల బాక్సుల్ని సంచిలో సర్దుకున్నాడు.

1.27 గంటల 23 సెకన్లు:

ద్విచక్ర వాహనం దిగి, మొదటగా దుకాణంలోకి వచ్చిన దుండగుడు సొత్తుతో, అంతకు ముందే వచ్చిన ‘వినియోగదారుడు’ హడావుడిగా బయటకు వెళ్లిపోయారు. ఆ సమయంలో వీరి మధ్య ఏదో సమాచార మార్పిడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

1.27 గంటల 39 సెకన్లు:

కిందపడి ఉన్న సజావుర్‌ రెహ్మాన్‌ను బెదిరించిన రెండో దుండగుడు సైతం దుకాణం నుంచి బయటకు వెళ్ళిపోయాడు. అప్పటికే వాహనం వద్ద ఆగి ఉన్న మరో దోపిడీ దొంగతో కలిసి ఉడాయించాడు.